తాత్కాలిక
ఆకర్షణను దాటి
ఆమె మనోదర్పణంలో
శాశ్వతంగా
నిలచిన రూపం?

# దర్పణం

అమిరపు
విష్ణుప్రియ
కథ

**ఆ**రోజు డి.ఎస్.ఆర్ కాలేజి యానివర్సరీ.

కాలేజి అంతా రంగురంగులదీపాల తోరణాలతో పెళ్లి పందిరిలా కాంతులీనుతోంది. కొత్త పెళ్లికూతురిలా కళకళలాడుతోంది. కాలేజి ఆవరణ మధ్యలో వున్న వేదిక. అప్పుడే పార్టీ ముగిసింది. సాంస్కృతిక కార్యక్రమాలు మొదలవడానికి ఇంకో గంట వ్యవధి వుండడంతో స్టూడెంట్స్ అందరూ గ్రూప్స్ గ్రూప్స్‌గా చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. రకరకాల డ్రెస్సుల్లో సీతాకోక చిలుకల్లా మెరిసిపోతున్న అమ్మాయిలు వాళ్ళ అందాల్ని చూపులతో తాగేస్తూ... అబ్బాయిలు.

చల్లటి సాయంత్రం...

అలివేల జడపాయలలో మత్తుగా నవ్వే మల్లెల మృదుత్వాన్ని సుతారంగా మీటి సౌరభాల్ని మోసుకొస్తున్న అల్లరి పిల్లగాలులు.

''వాతావరణం అందంగా... చాలా ఆహ్లాదకరంగా వుంది!'' స్వప్నతో అంటోంది లలిత.

''పార్టీ చాలా బాగా జరిగిందికదే''

''ఊ... శంకరం మాష్టారు పాట చాలా బాగా పాడారుకదూ!''

''ఊ...''

''ఏం పాట అది?... మ్రోగింది వీణ!... పదే పదే హృదయాలలోనా!'' ఆయనంత బాగా పాడగలరని నేనసలు అనుకోలేదు. రవి మాష్టారు తన స్పీచ్‌కూడా అదరగొట్టేశారు. మొత్తానికి మాష్టార్లందరూ వాళ్ల ప్రొఫెషన్స్‌ని కాస్సేపు మర్చిపోయి చిన్న పిల్లల్లా మనతో కలిసి బాగా ఎంజాయ్ చేశారుకదూ!''

''ఊ...''

లలిత ఒక్క నిమిషం ఆగింది.

ఎంతో హుషారుగా తను చెప్పుకుపోయే మాటలకు ''ఊ... ఊ....'' అంటూ పొడిపొడిగా



సమాధానాలిస్తున్న స్వప్నని చూసి ఆమె మనసు ఇక్కడ లేదని, ఏవో స్వాప్నికలోకాల్లో విహరిస్తోందని గ్రహించింది.

''ఏయ్ స్వప్నా! నేనిక్కడ నోరు పోయేటట్టు వాగుతుంటే నువ్వేంటే, ఊహల్లో విహరిస్తున్నావ్'' కోపం నటించింది లలిత.

''ఆ... ఊ... ఏం లేదు, ఏంలేదు'' తడబడింది స్వప్న.

''నీ ఆలోచనలన్నీ ఎవరిగురించో నాకు తెలుసులే!... నీ కలల చెలికాడు శరత్ గురించేకదూ?'' ముసిముసిగా నవ్వుతూ గుసగుసగా చెప్పింది చెవిలో.

''ఛీ పోవే...'' ముద్దుముద్దుగా (సిగ్గుగా) విసుక్కుంది స్వప్న.

''అడుగో నీ మానసచోరుడు, ఊహాల రాకుమారుడు ఇటే వస్తున్నాడు'' అంటూ దూరంగా వస్తున్న శరత్‌ని చూపించింది స్వప్నకి.

పింక్ కలర్ షర్ట్‌ని బ్లాక్ పాంట్‌లోకి టక్ చేసుకుని నవమన్మధుడిలా నడిచి వస్తున్నాడు శరత్. అతన్ని చూడగానే గుండె ఝల్లుమంది స్వప్నకి.

''హాయ్ లలితా! ఏమంటోంది మీ ఫ్రెండు?'' ఓరకంటితో చిలిపిగా స్వప్నని చూస్తూ అడిగాడు అతడు.

''ఏమో బాబూ! నాతో ఏమీ మాట్లాడడంలేదు. మీరే అడిగి తెలుసుకోండి! నే వస్తా!'' మెల్లగా అక్కడ్నించి జారుకుంది లలిత.

''స్వప్నా! అలా వెళ్లి మాట్లాడుకుందాం రా!'' అంటూ కాలేజీ వెనుకవైపుకు దారితీశాడు శరత్.

మంత్రముగ్ధలా అతణ్ణే అనుసరించింది స్వప్న.

ఆ కాలేజీ కొండప్రాంతంలో నిర్మించారు. ఆ చుట్టుప్రక్కల ఇళ్లుగాని, మరి ఏ ఇతర కట్టడాలుగాని లేవు. ఆ ప్రదేశమంతా నిర్మానుష్యంగా వుంది. కొంతదూరం నడిచాక ఎత్తయిన ఓ కొండరాయిని చాటుచేసుకుని ఓ చదునైన ప్రదేశంలో కూర్చుంటూ, ప్రక్కనే ఆమెకి చోటు చూపించాడు శరత్.

ఆ మసక వెలుతురులో దగ్గరగా, మరింత దగ్గరగా... అప్సరసలాంటి ఆమె అందం అద్భుతంగా తోచిందతనికి!

''స్వప్నా! పాలనురగలాంటి తెల్లటి ఈ షిఫాన్ చీరలో నువ్వు సాలార్‌జంగ్ మ్యూజియంలోని పాలరాతి శిల్పంలా వున్నావ్, తెలుసా?''

అతని చూపులు విరితూపులై ఆమెలోని అణువణువు స్పృశించగా... ఆమె కన్నెవయసులో ఏదో అలజడి....

''స్వప్నా!... మాట్లాడవేం?'' మత్తుగా, మంద్రంగా అతని స్వరం, అతని నిశ్వాసాలు ఆమె చెంపల్ని కెంపులు చేయగా -

అతని పెదవుల ఆరాటం ఆమె మెడవంపులో సంకేతాలు నింపగా అతని చేతులు ఆమె పైట చాటుగా దోబూచులాడసాగాయి.

అంతులేని పారవశ్యంలో అర్ధనిమీలిత నేత్రియైన స్వప్న మౌనమే అతనికి సమాధానమైంది.

ఆ ముగ్ధ మానిక మేని సుగంధాల్ని ఆఘ్రాణిస్తూ... ఆమె అందాల మకరందాలను ఆస్వాదిస్తూ...

సుఖాల దారుల్ని అన్వేషిస్తూ... ఆనంద పుటంచులవరకూ చేరుకోవాలనే ప్రయత్నంలో అతనుండగా...

అటుగా ఎవరో వస్తున్నట్టు చిన్న అలికిడి!

అంతే! ఆమె చివ్వున లేచి వడివడిగా ముందుకు నడిచింది.

స్వప్నా! ఆగు... ఎవ్వరూ లేరు! వెనుకనుండి అతనికేక... ఆమెలోని స్త్రీత్వం ఒక్క క్షణం వెనక్కి చూసినా... వివేకం మరింత ముందుకు తోసింది.

''బాడ్‌లక్!'' చేజారిన స్వర్గాన్ని తలుచుకుంటూ మౌనంగా గొణుక్కున్నాడు శరత్.

◆ ◆ ◆

ఫైనలియర్ స్టూడెంట్స్‌కి ఆరోజునుండి ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చారు. మధ్యాహ్నం కాలేజీనుండి ఇంటికి వచ్చిన స్వప్నకి గత నెలరోజులుగా ఖాళీగా వున్న ఎదురిల్లు సందడిగా కనిపించింది.

''అమ్మా! ఎదురింట్లో ఎవరైనా అద్దెకు దిగారా?'' పుస్తకాలు షెల్ఫ్‌లో పెట్టుకుంటూ

అడిగింది తల్లిని.

"అవునే గుంటూరునుండి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చారు. అతనేదో బ్యాంక్‌లో ఆఫీసరట. భార్యాభర్తలు ఇద్దరే. పిల్లలు లేనట్టున్నారు" చెప్పింది తల్లి.

సాయంత్రం అకౌంట్స్ చేసుకోవడానికి లలిత వాళ్లింటికి వెళ్తున్న స్వప్నకి ఎదురింటి వరండాలోని ఈజీచైర్‌లో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్న అతడు కనిపించాడు.

"ఎంత అందంగా వున్నాడు?" అనుకోకుండా వుండలేకపోయింది. ఆమె కన్నెమనసు!

◆ ❖ ◆

వేసవికాలం అవడంతో పెందళాడే భోంచేసి ఎనిమిది గంటలకల్లా చదువుకోడానికి డాబాపైకి వెళ్లేది స్వప్న.

ఆ అమ్మాయి వెళ్లిన మరికొద్దిసేపటికే ఏవో పుస్తకాలు చేతబట్టుకుని వాళ్ల మేడపైకి చేరే అతన్ని చూసిన ఈయనకేం ఎగ్జామ్స్‌ఉన్నాయనో ఇంత కష్టపడుతున్నాడు పాపం! అనుకునేదిమనసులో...

ఏవో పుస్తకాలు చదువుతున్నట్టు నటిస్తూ తనని దొంగచూపులు చూడ్డానికే అంత కష్టపడుతున్నాడని త్వరలోనే గ్రహించింది స్వప్న. అలా వాళ్లిద్దరి మధ్య చూపుల భాషలు నవ్వుల పలకరింపులూ కొన్నిరోజులు కొనసాగాయి.

◆ ❖ ◆

ఎగ్జామ్స్ మొదలయ్యాయి.

ఆరోజు లాస్ట్ ఎగ్జామ్ కూడా సంతృప్తిగా వ్రాసి హాయిగా ఊపిరి పీల్చుకుని స్వేచ్ఛా విహంగంలా ఇంటికి వస్తున్న స్వప్నకి వెనుకగా...

"స్వప్నా! ఎగ్జామ్స్ అన్నీ బాగా వ్రాశావా?" ఎవరిదో మృదుమధురమైన కంఠధ్వని.

"ఎవరబ్బా?" అనుకుంటూ వెనక్కి తిరిగి చూసింది. ఎదురింటి ఆ చూపుల విలుకాడు ఆరాధనగా తనవంకే చూస్తూ అడుగుతున్నాడు.

"బాగానే వ్రాశాను" అతన్నంత దగ్గరగా చూసిన ఆమెకి గుండె వేగం హెచ్చింది. గొంతుకేదో అడ్డు పడ్డట్టయింది.

"స్వప్నా... నీతో చాలా విషయాలు మాట్లాడాలి. ఈవెనింగ్ కొండ మీది రామాలయానికి రాగలవా?" అడిగాడు.

"ఊహు..." తల అడ్డంగా తిప్పింది.

"ప్లీజ్ స్వప్నా! ఎన్నో రోజులుగా ఆశతో



ఎదురుచూస్తున్నాను కాదనకు'' అతని గొంతులో అర్థింపు.

మౌనంగా వుండిపోయింది.

ఆమె మౌనాన్ని అంగీకార సూచనగా భావించి కాబోలు ''ఐదు గంటలకు నీకోసం రామాలయంద్గర ఎదురుచూస్తుంటాను'' అనేసి వెళ్లిపోయాడతను.

స్వప్న ఇంటికొచ్చి భోంచేసి పడుకుంది. ఇన్నాళ్ల నిద్ర మేల్కొని కష్టపడి చదివినందుకు ఈరోజు హాయిగా తృప్తిగా నిద్రపోదామనుకుంది. అతగాడి ఆలోచనలతో సతమతమయ్యే మనసుతో పోటీపడుతూ కళ్లు పుచ్చపూలలా విచ్చుకున్నాయేతప్ప నిద్ర రాలేదు. అతను చెప్పినట్టుగా వెళ్లకూడదనే అనుకుంది. హాల్లో గడియారం ఆరు గంటలు కొట్టింది. అలాగే కదలకుండా పడుకుంది. పదినిమిషాలు గడిచాయి.

''ప్లీజ్ స్వప్నా! వస్తావుకదూ!'' జాలిగా అడుగుతున్న అతని రూపం ఆమె మనోఫలకంమీద కదలాడగా ఒక్క ఉదుటున లేచి ఐదు నిమిషాల్లో ఫ్రెష్‌గా తయారై రామాలయానికి బయల్దేరింది.

అల్లంత దూరాన్నించే స్వప్నని చూసిన అతని కళ్లలో కోటి వెలుగులు... ''స్వప్నా వచ్చావా!'' అతని గొంతులో శతకోటి రాగమాలికలు.

''నాలుగు గంటలనుంచి ఎదురు చూస్తున్నాను. ఆరు గంటలుదాటిపోయింది. ఇంక రావనే అనుకున్నాను. భరించలేని నిరాశ పొందాను. ఇంతలో దేవాంగనలా నడిచివచ్చే నిన్ను చూసి నా దేవత కరుణించిందనుకున్నాను.

స్వప్నా! తొలిసారిగా సౌందర్యాధి దేవతలా నాకు దర్శనమిచ్చావు. అప్పటినుండి ఎప్పుడూ నిన్ను చూస్తుండాలని, నీతో మాట్లాడాలనే కోరిక నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది.

స్వప్నా! నీ అందం ఎంత గొప్పదో నీకు తెలుసా! నిజం స్వప్నా! నీ అందం ఎత్తయిన నిమ్నోన్నతం!

నయగారా జలపాతం!! గలగలపారే గోదారి!!!

నీలాకాశపు నీడలు చూసి పురివిప్పి ఆడే నెమలి సోయగం దానికి తెలియనట్లే నీ అందం ఎంత అద్భుతమైనదో నీకు తెలియకపోవచ్చు: సౌందర్యారాధకుడనైన నాకు తెలుసు స్వప్నా! నాకు తెలుసు.. ఈ రజత శిల్పం ఎంత అమూల్యమైందో...'' అతని కంఠంలో ఉద్వేగం చోటుచేసుకోనగా - స్వప్న చేతిని తన అరచేతిలో ఇముడ్చుకుని నొక్కుతూ చెప్పాడతను.

''స్వప్నా... ఈ దీనుడి మీద దయవుంచి రోజూ నాకు కన్పిస్తూ నాతో మాట్లాడుతూ వుంటావుగా! ప్లీజ్...''

అతని మాటలు ముత్యాల పేటలై ఆ ముదిత ఎద వీణపై సరాగాలు పలుకుతుండగా... ఆ రాగజలధిలో ఎంతసేపలా ఓలలాడిందో...

ఆ గాఢ సుషుప్తిలోనుంచి బయటపడేసరికి బాగా చీకటిపడిపోయింది. ఇక నే వెళ్తానంటూ లేచింది.

◆ ❖ ◆

ఆరోజు ఉగాది పండుగ.

''అమ్మలూ!... ఆ ఎదురింటావిడ పుట్టింటికెళ్లింది. ఈయన మాత్రం సెలవు దొరకకేమో ఇక్కడే వుండిపోయాడు. మగమనిషి ఈ రెండురోజులనుండి ఏం వండుకుంటున్నాడో, ఏం తింటున్నాడో ఆ టేబుల్‌మీద వున్న స్టీల్ బాక్స్‌లో పులిహోర, స్వీట్స్ పెట్టాను వెళ్లి అతనికిచ్చిరామ్మా... నేనలా పక్కింటి పిన్నిగారింటికి వెళ్లొస్తాను'' అని చెప్పి వెళ్లిపోయింది స్వప్నతల్లి.

స్వప్న మనసు ఎగిరి గంతేసింది. అతనితో ఏకాంతం ఆమెకెంతో ఇష్టమైన విషయం. బాక్స్ పట్టుకుని వెళ్లి మెల్లగా చప్పుడు కాకుండా గేటు

తీసింది. గుమ్మానికున్న కాలింగ్‌బెల్ నొక్కుతుంటే చేతి కంపనాన్ని కంట్రోల్ చేసుకోవడం ఆమెవల్ల కాలేదు.

తలుపు తీసిన అతను -

''ఓ స్వప్నా! నువ్వా... రారా...'' అనుకోని ఆమె ఆగమనానికి పరవశించిన మనస్సుతో తియ్యగా స్వాగతం పలికాడు.

''అమ్మ మీకివ్వమంది'' బాక్స్ అతని చేతికందించింది.

''ఏమిటది? అమృతమా?'' స్టీలు బాక్స్ చేతిలోకి తీసుకుంటూ ఆమె కళ్లలోకి కొంటెగా చూస్తూ అడిగాడు.

''అమృతంకాదు. స్వీట్స్'' అతని కొంటెతనానికి ఆమె గడుసుదనం జవాబిచ్చింది.

''మోహినిలా నువ్వు తెచ్చేసరికి అమృతమేమో అనుకున్నాను''

అతని కళ్లలోని కొంటెతనం మాయమై, ఆ స్థానంలో ఆరాధన చోటుచేసుకుంది.

లేత పసుపురంగు దుస్తుల్లో అప్పుడే విచ్చుకున్న ముద్దబంతిలాంటి ఆ ముగ్ధ మనోహర రూపం అతణ్ణి తన్మయుణ్ణి చేయగా... ఆమెవంకే తేరిపార చూస్తూ పరిసరాలు మర్చిపోయి ఒక్క క్షణం అలాగే వుండిపోయాడు. మరుక్షణమే తేరుకున్నవాడిలా...

''స్వప్నా! అలాగే నిలబడిపోయావేం? రా... రా! లోపలికి రా. ఇలా వచ్చి కూర్చో'' అంటూ బెడ్‌రూమ్‌లోకి దారితీశాడు. కాస్త తటపటాయింపుగా అతని వెనుకనే గదిలోపలికి వెళ్లిన ఆమె కళ్లార్పడం మర్చిపోయింది. గొప్ప కళాత్మకమైన పెయింటింగ్స్‌తోనూ వివిధ రకాలైన చెక్కటి హస్తకళా రూపాలతోనూ చాలా ఆర్టిస్టిక్‌గా వుందా గది! ఆ గదిని ఒక మనోజ్ఞ దృశ్యకావ్యంలా మలిచిన అతని కళాత్మక దృష్టికి, అభిరుచికి ఆమె మనసులోనే అభినందనలు అర్పించింది. ఇంతలేసి కళ్లతో ఆ రూమ్‌నంతా, ప్రతి అగుళం ఎంతో జాగ్రత్తగా చూస్తున్న ఆమె దృష్టి ఒక అందమైన తైలవర్ణ చిత్రంపై నిలిచిపోయింది. వెన్నెల్లో వనకన్యలా తన ప్రియుని రాకకై ఎదురుచూస్తున్న విరహోత్కంఠిత ఆ చిత్రంలోని సుందరి.

ఆ చిత్రంలోని అమ్మాయి చాలా అందంగా వుందికదూ!'' ఆమె చూస్తున్న చిత్రంకేసి చూస్తూ అడిగాడు.

అవునన్నట్టుగా తలూపింది ఆమె.

''నీలాగే!... అవును స్వప్నా! ఆ అమ్మాయిలో

## జంట

''చెట్టుపైనున్న ఆ గువ్వలజంటను చూస్తే నీకేమనిపిస్తుంది'' అడిగింది ప్రియురాలు.

''వేపుకుని తినాలనిపిస్తుంది!'' చెప్పాడు ప్రియుడు.

-డి.క్రిస్టఫర్‌బాబు (మణుగూరు)



నువ్వే నాకు కనిపిస్తావు. అందుకే ఆ పెయింటింగ్ నా మంచానికెదురుగ వుంచాను. ఆమెలో నిన్ను చూసుకుంటూ, ఊహించుకుంటూ గంటలు గంటలు గడిపేస్తాను తెలుసా?'' స్వప్న ముఖచంద్రబింబాన్ని తన చేతుల్లోకి సున్నితంగా తీసుకుని ఆ హరిణ నయనాల్లోకి లోతుగా చూస్తూ చెప్పాడు.

అతని కరస్పర్శకు ఆమె బుగ్గల్లో మందారాలు విరబూశాయి. పగడపు కెమ్మోవి చివురుటాకులా వణికింది.

సిగ్గుతో గులాబి మొగ్గే అయి అతని వక్షస్థలంపై వాలిపోయింది. స్వప్న.

బిడియపడే ఆ స్నిగ్ధత్వం అతనిలోని వేడిరక్తాన్ని పొంగించగా ఆ ముకుళిత పద్మాన్నలాగే పొదివిపట్టుకుని, మృదువుగా నిమురుతూ, ఒక్కొక్క రేకే సున్నితంగా విడదీస్తూ రసాస్వాదనకై ఆయత్తమవుతుండగా అప్పుడు వినిపించింది.

''అయ్యగారూ! తలుపులు తీయండి! బాసన్లు తోమేసి త్వరగా ఎళ్లాల. ఇయ్యాలసలే పండగ కూడాను'' కర్ణకఠోరమైన పనిమనిషి గొంతు. ఆ వెనకే దబదబా బాదుతున్న తలుపుల చప్పుడు. బంగినపల్లి మామిడిపండు కొద్దిగా టేస్ట్ చేసి వదిలిపెట్టి వెళ్లడం అతనికెంతమాత్రం ఇష్టం లేని విషయం. అందుకే ఆనందభైరవి రాగంలో అపశృతిలాంటి ఆ పనిమనిషి కేక విననట్టు వుండిపోయాడు. అయితే అది ఊరుకుంటుందా! తలుపులా విరిగిపోయేట్టుగా కొడ్తూనే వుంది. అంతకంతకూ గొంతు పెంచుకుని పిలుస్తూనే వుంది.

''పనిమనిషి వచ్చినట్టుంది!'' స్వప్న చప్పున అతన్నుంచి విడివడింది. అమృతభాండంలో విషపుచుక్కలా ప్రవేశించిన ఆ పనిమనిషి మీద గొంతువరకూ వచ్చిన కోపాన్ని అతి ప్రయత్నంమీద నిగ్రహించుకుని ''జస్ట్ ఎ మినిట్ స్వప్నా!'' అస్పష్టంగా అంటూ వంటింట్లోకి వెళ్లాడను.

ఒక్క అంగలో ఇంట్లోకి వచ్చి పడింది స్వప్న.

◆ ❖ ◆

''స్వప్నా! సుజాతక్కదగ్గరనుండి లెటర్ వచ్చిందే'' అప్పుడే బజారుకెళ్లి వచ్చిన స్వప్నతో చెప్పింది తల్లి.

''ఆహా... ఏం రాసిందమ్మా సుజాతక్క?'' డ్రెస్ మార్చుకుంటూ అడిగింది.

''దానికి ఎనిమిదోనెలవచ్చి వారం రోజులైందట. ఒంట్లో కాస్త నలతగా వుంటోందిట. మీ బావసంగతి తెలిసిందేకదా! ఆయనకు ఆఫీసుతప్ప మరో ధ్యాసే వుండదు. ఇప్పుడు మరీ పని ఎక్కువగా వుందంటూ ప్రొద్దున వెళితే రాత్రి 8 గంటలకు ఇంటికి చేరుకుంటున్నారట. పిలిస్తే పలికే వాళ్లు లేరు. ఒక్కదాన్ని, బెంగగా వుంటోంది. స్వప్న పరీక్షలైపోయాయిగా. దాన్ని పంపించమ్మా అంటూ వ్రాసిందే''.

''అమ్మో. నేనువెళ్లనుబాబూ! నాకక్కడంతా కొత్త. బోర్ కొడ్తుంది'' తల్లిమాటలు పూర్తిచేయకుండానే నసిగింది స్వప్న.

''అలా అంటే ఎలాగే అమ్మలూ! అది ఒట్టిమనిషికూడా కాదు. ఈ టైమ్‌లో తోడుగా తనవాళ్లు దగ్గరుంటే బావుండునని ఎవరైనా కోరుకుంటారు. పోనీ నేను వెళ్దామంటే - మీ నాన్నగారి సంగతి నీకు తెలుసుకదా! ఆయనసలే షుగర్ పేషెంట్. వేళకన్నీ అమర్చాలి. మా అమ్మవుకదూ! నా మాట విని వెళ్లుతల్లీ. అయినా నువ్వేమన్నా నెలలుండాలా, సంవత్సరాలుండాలా! ఒక్క ఇరవై రోజులు ఎలాగో గడిపావంటే, ఈలోగా అక్కయ్యకు తొమ్మిదవ నెల రానే వస్తుంది. నాన్న వచ్చి మిమ్మల్నిద్దరినీ ఇక్కడకు తీసుకుని వస్తారు. ఊ... అను తల్లీ'' గడ్డం పట్టుకుని బ్రతిమిలాడింది ఆమె.

అయిష్టంగానే ప్రయాణానికి సంసిద్ధురాలైంది

స్వప్న.

◆ ❖ ◆

స్వప్నను రిసీవ్ చేసుకోవడానికి అక్కా బావా ఇద్దరూ స్టేషన్‌కి వచ్చారు. నిండు గర్భిణితో ఎదురైన అక్కను చూసేసరికి మమతానురాగాలు పెల్లుబికాయి స్వప్నలో. తనని చూడగానే అక్కయ్య కళ్లలో కదలాడిన ఆప్యాయతను చూశాక - తను ముందు రావడానికి ఇష్టపడని విషయం గుర్తొచ్చి ఒక్క క్షణం గిల్టీగా ఫీలయింది. ఇంటికొచ్చాక వేడివేడి నీళ్లతో స్నానం చేసి నైటీ వేసుకుని వచ్చేసరికి ఘుమఘుమలాడే కాఫీ కప్పు చెల్లికందించింది సుజాత.

''నేను నీకు సాయం చేయడానికొస్తే నువ్వే నాకు సేవ చేస్తావేమిటక్కా''

''నువ్వు చేసే సాయమేదో రేపట్నించి చేద్దువుగానిలే... ఈ వేళ్టికి రెస్టు హాయిగా రెస్టు తీసుకో''

''రెస్టా... నాకసలు అలసటే లేదు. ట్రైనులో హాయిగా పడుకునే వచ్చాను''

''అయితే డ్రెస్ మార్చుకుని రా... రవిని పరిచయం చేస్తాను'' చెప్పింది సుజాత.

''రవా? అతనెవరు?''

''మన మేడపైన పోర్షనులో అద్దెకుంటున్నాడు. చాలా మంచివాడు. కథలు, కవిత్వాలు, వ్యాసాలు ఏవో చాలా రాస్తుంటాడులే. పరిచయం చేశాననుకో... నీకు మంచి టైంపాస్...''

''అయితే పద. ఒక్క నిమిషంలో వచ్చేస్తా'' హుషారుగా లేచింది స్వప్న. రవిని చూశాక అక్క చెప్పిన మాటల్లో ఏమాత్రం అతిశయోక్తి లేదనిపించింది. తెల్లగా, సన్నగా వున్న అతను పెద్ద అందగాడు కాకపోయినా అతని చూపుల్లో ఏదో చురుకైన శక్తి, మాటల్లో మృధువైన ఆకర్షణ ఆమెని కట్టిపడేశాయ్. నాలుగురోజుల్లోనే వాళ్లిద్దరూ ఎంతోకాలంనుండి పరిచయమున్నవాళ్లలాగా చాలా సన్నిహితులయ్యారు. రవి ఆఫీసునుంచి వచ్చిన పావు గంటకల్లా స్వప్న మేడపైకి వెళ్లేది. సాహిత్యం గురించి, మంచి రచయితలగురించి, వారి రచనలగురించి ఆమెకు తెలియని ఎన్నో విషయాలు చెప్పేవాడు రవి. అతను చెప్పే ఆ విషయాలకన్నా చెప్పే విధానం ఎంతో ఇష్టంగా అన్పించి, ఆసక్తితో వినేదామె. అతనికి భాష విషయ పరిజ్ఞానమే కాకుండా మాటతీరుకూడా ఒక ప్రత్యేక సరళిలో వుండేది. హ్యూమరస్‌గా, హస్కీగా



## సకల కళాభానుమతి

సంగీతం, సాహిత్యం, నాట్యం, నటన, చలనచిత్ర దర్శకురాలు, చిత్రలేఖనం ఇలా సకల కళావల్లభురాలయిన భానుమతి 1985లో తమిళనాడు రాష్ట్ర మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవి చేపట్టారు. వరవిక్రయం భానుమతి నటించిన మొదటి సినిమా. ఈమె వ్రాసిన అత్తగారి కథలు మంచి ఆదరణ పొందింది. రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1945లో భరణి పిక్చర్స్, స్టూడియో ప్రారంభించింది. 1952లో మొదటిసారిగా దర్శకత్వం వహించారు. చిత్రం చండీరాణి.

- మదన్

మాట్లాడం అతనికో అస్సెట్. మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యమధ్యలో అతను వేసే జోక్స్‌కి పడీపడీ నవ్వేది స్వప్న. తనలా నవ్వుతుంటే అతడు తనవంకే అలాగే... ఇష్టంతో చూస్తూండడం ఆమె దృష్టిని దాటిపోలేదు.

గంటలకొద్దీ అలాగే కబుర్లలో లీనమైపోయే వారిద్దరూ క్రిందనుండి భుజనానికి రమ్మని, అక్కకేకేస్తేగాని ఆకలి గుర్తొచ్చేదికాదు స్వప్నకి.

''స్వప్నా ఈరోజు గురువారంకదా! మీ బావగారు, నేను సాయిబాబా గుడికి వెళ్దామనుకుంటున్నాము. నువ్వుకూడా వస్తావా సరదాగా వెళ్లిరావచ్చు'' చెల్లెల్ని అడిగింది సుజాత.

''అబ్బా... నాకీవాళ కొంచెం తలనొప్పిగా వుందే అక్కా. మరోసారి ముగ్గురం కలిసి వెళదాం. ఇవాల్టికి మీరు వెళ్లిరండి''

ఆ సమయంలో ఆమెకు బయటకు వెళ్లడంకంటె రవి సమక్షంలో గడపడమే ఎక్కువ ఇష్టం.

''మేమొచ్చేసరికి ఆలస్యం అవుతుందేమో నువ్వు భోంచేసి పడుకో. జాగ్రత్త'' అని చెప్పి ఐదు గంటలకల్లా అక్కా బావా వెళ్లిపోయారు.

వాళ్లటు వెళ్లగానే చెంగున లేచి స్నానం చేసి తెల్లటి కాటన్ చీరలో మల్లెపూవులా తయారై అభిసారికలా రవి రాకకోసం ఎదురుచూడసాగింది స్వప్న. ఆమె నిరీక్షణకి ప్రతిఫలంగా రోజుకంటే పావుగంట ముందే వచ్చాడు రవి. అతను వచ్చిన పది నిమిషాలకల్లా తలుపు తాళం వేసి మేడపైకి వెళ్లింది స్వప్న.

హాయిగొలిపే అందమైన సంధ్యా సమయం...

ఇరవై వసంతాల కన్నెప్రాయపు గుప్త నిక్షేపాల్ని మెత్తగా తాకుతూ పైట చెంగునల్లల్లాడించే అల్లరి మలయమారుతం... మనసుని ఉత్తేజపర్చి, తియ్యటి ఊహల్లో ఊగించి ఊరించే మత్తైన మల్లెపందిరి. పడుచుదనపు ఉరవడి, వలపుల సందడి ఇవన్నీ చాటుగా గమనిస్తూ తొంగితొంగిచూసే చిలిపి చందమామ. హాయిగా రిఫ్రెష్ అయి, పల్చటి పైజమా వేసుకుని వచ్చాడు రవి.

మల్లెపందిరికింద వేసివున్న మంచంపై వయ్యారంగా కూర్చుని చుబుకం క్రిందుగా చేయి ఆన్చి అలవోకగా కలలు కంటున్న ఆ స్వప్నసుందరిని చూసి ముగ్ధుడయ్యాడు.

నిద్రాణంగా వున్న అతని హృదయవీణను ఒక్కసారిగా శృతిచేసినట్లయింది.

''స్వప్నా!'' ఈ కొద్దిరోజుల్లోనే ఆమెపై గుండెలోతుల్లో కొండంతలుగా పెంచుకున్న ఇష్టాన్ని గొంతులో పలికించాడురవి.

''ఆ... వచ్చారా?'' స్వప్న తన ఊహల హర్మ్యంనుండి బయటకు వచ్చింది.

''కొత్త కథేదైనా మొదలెట్టారా!'' తనలో చెలరేగే భావాలను కప్పిపుచ్చుకుంటూ మామూలుగా వుండడానికి చేసే ప్రయత్నంలో అడిగింది.

''లేదు స్వప్నా! నాకీమధ్య ఏవీ రాయాలనిపించడంలేదు''

''ఎందుకని?'' ప్రశ్నార్థకంగా అడిగింది.

''నేను నా రచనలలో పాత్రలకు కల్పించే ప్రేమానుభవాలు, దివ్యానుభూతులు నేనుకూడా పొందాలని నా మనసు ఆరాటపడుతోంది. నన్ను ప్రేరేపిస్తోంది. అందుకే ఏవీ రాయలేకపోతున్నాను''

''ఏం స్వప్నా... అవన్నీ కావాలని ఆశపడడం తప్పంటావా?'' ఆమె కళ్లల్లోకి సూటిగా చూస్తూ సమీపంగా - అతి సమీపంగా ఆమె చెప్పే సమాధానంకోసం ఎదురుచూస్తూన్నాడతను.

''తప్పని ఎవరంటారు! ఎవరికైనా సహజమే''

''అయితే స్వప్నా! నా ఆశలు తీరతాయంటావా! నా కలలు ఫలిస్తాయా! నా ప్రేమ దేవత కరుణించి నాకా అనుభూతుల్ని పంచిపెడుతుందంటావా?''

''మాట్లాడవేం స్వప్నా! చెప్పు స్వప్నా... చెప్పు

నువ్వే ఆ ప్రేమ దేవతవి! నువ్వే నా కావ్య నాయికవి. నా ఊహా సుందరివి. రచనలకే అంకితమైన నా మనసు మూలల్లో నిద్రాణంగా వున్న కోర్కెల్ని తట్టిలేపి నాలో వలపులు రగిలించిన వెన్నెల రాణివి. ఐ లవ్ యు స్వప్నా... ఐ లవ్ యు... ఇన్నాళ్ళుగా నీపై అంచెలంచెలుగా పెంచుకున్న అభిమానం పెరిగి పెరిగి వటవృక్షమైపోయింది'' అంటూ ఆర్తిగా ఆమె ఒడిలో తలదాచుకున్నాడు. మనసు కొంత తెలిసినా - అతనిలోని ఆవేశం ఆమె కొత్తగా చూస్తోంది. ఇష్టం, కోరిక, ఆనందం కలగలిసి చమరించిన ఆమె తనూలత తనకు తెలీకుండానే అతని గాఢపరిష్వంగంలో ఒదిగొదిగి పోసాగింది.

ఒదిగిపోయే ఆ ఒయ్యారాన్ని తమకంతో స్పృశిస్తూ, ఆ మొగలిరేకుల సొగసులపై పెదవులతో ప్రేమకావ్యాలు రాస్తున్నాడతను.

ఆ సరాగాల డోలలో, సుమధుర హేలలో ఆమె తనువు సుమధనువు కాగా - వింటిని సారించాడతడు. స్వప్నకి ఒక్కసారిగా భయం ఆవహించింది. జరక్కూడనిదేదో జరగబోతోందన్న ఫీలింగ్ అణువణువునా వ్యాపించగా చటుక్కున అతన్ని తోసి లేచి నించుంది.

''రవీ! కొంచెం మంచినీళ్లు కావాలి''

అమృతం తాగబోయే సమయంలో మంచినీళ్లడుగుతున్న ఆమెని ఒక్క క్షణం పిచ్చిదాన్ని చూసినట్టు చూసి లోపలికెళ్లాడతను నీళ్లు తీసుకుని రావడానికి.

చేతిలో మంచినీళ్లగ్లాసుతో గబగబా వచ్చిన రవికి చివరి మెట్టు దిగుతూ కనబడింది స్వప్న.

''స్వప్నా! ఇదిగో మంచినీళ్లు'' ఆమె వెనుకే పరుగెట్టాడు.

దభీమని మూసిన తలుపులు అతణ్ణి చూసి వెక్కిరింపుగా నవ్వాయి.

''స్వప్నా! తలుపు తియ్ ప్లీజ్! ఒక్కసారి తలుపు తీయ్!''


తర్వాత ఎంతో సేపలా కొట్టి కొట్టి విసుగొచ్చి కాబోలు అతను వెళ్లిపోయాడు.

◆ ❖ ◆

''స్వప్నా! నిద్రపోతున్నావా?'' అక్క గొంతు విని గబుక్కున లేచి, తలుపు తీసింది స్వప్న.

''ఏమ్మా! తలనొప్పి ఇంకా తగ్గలేదా?'' తలుపు తీసిన చెల్లెలి వాలకం చూస్తూ అడిగింది సుజాత.

''కాస్త ఫరవాలేదక్కా...'' అంటూనే మళ్లీ వెళ్లి



పడుకుంది.

సుజాత భోజనానికన్నీ సిద్ధం చేస్తుండగా హాల్లో ఫోన్ మోగింది. చెయ్యి తుడుచుకుంటూ వచ్చి ఫోనందుకుంది.

''హల్లో...''

సుజాతా హియర్...''

నేనమ్మా మీ నాన్నను మాట్లాడుతున్నాను''

''నాన్నగారా! మీరా? ఏంటి?'' కాస్త కంగారుగా అడిగింది. ఎంతో ముఖ్యమైన విషయమైతే తప్ప నాన్నగారు సాధారణంగా ఫోన్ చేయరు. ఈ వేళప్పుడు ఎందుకు చేశారో సుజాతకి అర్థం కాలేదు.

''కంగారు పడాల్సిందేం లేదమ్మా! శుభవార్తే! నేను మీ అమ్మా బయల్దేరి రేప్పొద్దున విజయవాడ వస్తున్నాం. అట్నుంచి స్వప్నను తీసుకుని పొన్నపల్లి వెళ్లాలి''

''పొన్నపల్లా? ఇంత సడన్‌గా ఎందుకు నాన్నగారూ?''

అదంతా రేపొచ్చాక చెప్తానుగా... అంతవరకు సస్పెన్స్. వుంటానమ్మా మరి బై...''

''నాన్నగారు ఫోన్ చేశారే... అమ్మ, నాన్న రేపు ఇక్కడికి వస్తున్నారుట'' అంటూ అప్పుడే హాలులోకి వచ్చిన స్వప్నకి విషయమంతా చెప్పింది సుజాత.

ఇప్పుడు పొన్నపల్లి వెళ్లడమెందుకో అర్థంగాక ముగ్గురికీ సస్పెన్స్‌తో ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు.

ఏదేమైనా ఇన్నిరోజులు అమ్మానాన్నల్ని వదిలిపెట్టి ఎక్కడా వుండలేదేమో. రేపు వాళ్లు వస్తారనే వార్త స్వప్న మనసును సంతోష తరంగాలలో ముంచెత్తింది.

◆ ❖ ◆

''నిన్న కమలత్తయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. 'కిషోర్‌కి బొంబేలో ఏదో పెద్దకంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా జాబ్ వచ్చిందట. వాడికి పెళ్లిచేసి పంపితేనేగాని నా మనసుకు శాంతి వుండదు. కాబట్టి నువ్వు వదిన స్వప్నని తీసుకుని ఉన్నఫళంగా బయలుదేరి రండి. కిషోర్ పెద్దయ్యాక స్వప్నని చూడలేదు. కాబట్టి వాళ్లిద్దరూ ఒకళ్లనొకళ్లు చూసుకుంటారు. ఇకపోతే... వారం పదిరోజుల్లో మూంచి ముహూర్తాలున్నాయిట. వాళ్లిద్దరి జాతకాలు చూపించి. వీలైతే ఆ ముహూర్తాలకే లగ్గం పెట్టుకుందాం! అంటూ హడావుడిగారాసేసిందమ్మలూ మీ అత్తయ్య'' వచ్చీ రావడంతోనే విషయమంతా క్లుప్తంగా చెప్పేసి వాళ్ల సస్పెన్స్‌ను తీర్చేశారు స్వప్న తండ్రి చంద్రశేఖరంగారు.

''అయితే మా అల్లరి చెల్లాయికి కిషోర్ తొందర్లోనే ముక్కుతాడేస్తుడన్నమాట'' అక్కడే నిలబడి వింటున్న స్వప్న ముక్కుపట్టి ఊపింది సుజాత.

''ఏమ్మా స్వప్నా! కిషోర్ బావని చేసుకోవడం నీకిష్టమేనా?'' అడిగారు నాన్నగారు.

ఏం మాట్లాడలేదు స్వప్న. అసలు బావ ఎలా వుంటాడో... పెద్దయ్యాక తను చూడనే లేదతన్ని.

ఆమెలోని భావాలను గ్రహించినవాడిలా మళ్లీ ఆయనే అన్నారు ''కిషోర్ బావని నువ్వు చిన్నప్పుడెప్పుడో చూశావు. లాస్ట్ ఇయర్ నేను వెళ్లినప్పుడు చూశానుకదా చక్కటి పర్సనాలిటీతో హుందాగా తీరాడతను. నీకు తప్పకుండా నచ్చుతాడు.

అందమైన రూపం, మంచి ఉద్యోగం, వీటన్నింటినీ మించి నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకోగల ఉన్నతమైన వ్యక్తిత్వం కిషోర్‌ది. ఇక అత్తయ్య, మామయ్యల విషయంకొస్తేవాళ్ల ఆదరణ అభిమానాలగురించి నేను నీకు ప్రత్యేకించి చెప్పనవసరంలేదు. నీ చిన్నప్పుడు మీ అమ్మకు చాలా కాలంబంట్లో బాగుండకపోతే రెండేళ్లపాటు మీ అత్తయ్య దగ్గరే పెరిగావునువ్వు. అప్పుడామె మా కోడలు మాకోడలు అంటూ నీకు ఆప్యాయతను

ఉగ్గుపాలతో రంగరించి పోసింది.

అమ్మయితే "దాని మొహం దాన్నేం అడగాలి. చిన్నప్పటినుండి అనుకుంటున్న సంబంధమేకదా!" అంది.

"ఎంత అనుకున్న సంబంధమే అయినా, నీ ఇష్టాఇష్టాలు తెలుసుకోకుండా పెళ్లి నిర్ణయించడం నా అభిమతం కాదు. అందుకే అడుగుతున్నాను. నీ మనసులోని మాట నిర్మొహమాటంగా చెప్పు తల్లీ"

"మరి బావని చూడ్డానికి పొన్నపల్లి వెళ్దామంటావా?"

కూతురి ముఖంలోకి తొంగిచూసి నవ్వుతూ అడిగారాయన.

"పొండి నాన్నా!" లేడిపిల్లలా అక్కడ్నించి తుర్రుమంది స్వప్న.

"ఆడపిల్ల తన మనసులోని భావాన్ని ఇంతకంటే ఇంకేవిధంగా ప్రకటిస్తుంది నాన్నా. ఇక మీరు ఎటువంటి సందేహాలు పెట్టుకోకుండా ఫోంచేసి, మధ్యాహ్నం బస్సుకు పొన్నపల్లి బయల్దేరండి" అంటూ వంట ప్రయత్నంలో కిచెన్‌లోకి నడిచింది సుజాత హుషారుగా.

ఆ సాయంత్రమే స్వప్న అమ్మా నాన్నలతో కలిసి పొన్నపల్లికి వెళ్లడం అక్కడ సినిమా హీరోలా వున్న తన బావని చూడడం, వారం రోజుల్లోనే పెళ్లి ముహూర్తం నిర్ణయించుకురావడం, అంతా కలలోలాగా జరిగిపోయింది.

మొదటిరాత్రి...

తెల్లని కంచి పట్టుచీరలో చేతిలో పాల్గ్లాసుతో రతీదేవిలా నడిచివస్తున్న స్వప్నని చూసి, ఆపుకోలేని ప్రేమావేశంతో ఆమెని అల్లుకుపోయాడు కిషోర్. కంచుకోటలాంటి అతని కౌగిలిలో ఎటువంటి భయాలు, సంకోచాలు లేక హాయిగా కరిగిపోతున్న ఆమెకి ఆ క్షణంలో తన పైటచాటున బుల్లి పాపాయిలా అల్లరిచేసే శరత్‌గాని...,

తన కళ్లవంకే ఆరాధనగా చూస్తూ తనను సౌందర్యాధి దేవతగా అభివర్ణి ఎదురింట తనుగాని...

ఐ లవ్ యూ అంటూ తనఒడిలో ఆర్తిగా తలదాచుకున్న రచయిత రవిగాని,

వీళ్లెవ్వరూ ... గుర్తురాలేదు.

'దర్పణం'లాంటి ఆమె కన్నెహృదయం తన బావ(భర్త) రాకతో 'చిత్రపటంగా మారిపోయింది.

## విప్లవం

జైల్లో...

"ఇదేంటండీ ఆశ్చర్యంగా వుందే. మీ గ్రామంలో వ్యవసాయ విప్లవం తీసుకొచ్చినందుకు నిన్ను అరెస్టు చేశారా?"

"అవును. గంజాయిమొక్కలు పెంచాను."

-విద్యాశర్మ (బాలగంగవపల్లి)

